సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 10 । జూలై । 2023



రాజన్న దర్శనానికి..

వేములవాడ: ఆషాఢమాసంలోనూ రాజన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.



గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న 20 కోడెలను జనగామ జిల్లా తడిగొప్పలకు చెందిన సహయోగా గోశాలకు అందజేశారు. శ్రీనివాస్, నరసింహామూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. చందుర్తి, రుద్రంగి మండలాల్లో మోస్తరు వర్షం పడగా.. మిగతా మండలాల్లో తుంపర్లు కురిశాయి. అత్యధికంగా చందుర్తిలో 38.7 మిల్లీమీటర్లు, అత్యల్పంగా సిరిసిల్లలో 1.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. రుద్రంగిలో 25.8, వేములవాడరూరల్‌లో 18.9, బోయినపల్లిలో 11.7, వేములవాడలో 13.5, కోనరావుపేటలో 15.9, వీర్నపల్లిలో 14.5, ఎల్లారెడ్డిపేటలో 4.3, గంభీరావుపేటలో 8.1, ముస్తాబాద్‌లో 5.3, తంగళ్లపల్లిలో 5.7, ఇల్లంతకుంటలో 2.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో 42 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

'అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ధరణి'



జెండా ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని అక్కపల్లిలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ మాజీ సర్పంచ్ పోతుల శ్రీనివాస్‌తోపాటు పలువురు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. రెవెన్యూ రికార్డులలో కబ్జా కాలం తీసివేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం ప్రేమ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.15వేలు, క్వింటాల్ వడ్లకు రూ.2,500 చెల్లిస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్, నాయకులు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, పర్శరాములు, బుచ్చాగౌడ్, దేవయ్య, చెన్నిబాబు, రాజునాయక్, భూమిరెడ్డి, మల్లయ్య, లచ్చిరెడ్డి, రాజు, గణపతి పాల్గొన్నారు.

బీసీ ప్లీనరీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 15న నిర్వహించే బీసీ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 10 వేల మందితో బీసీ ప్లీనరీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్ట నరేశ్, నవీన్, జగన్, నీరజ్, చింటూ, రోహిత్, సాయి, సోహెల్ పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



ఎల్‌ఎండీకి వెళ్తున్న నీరు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీలోకి నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం ప్రాజెక్టు ఒక్క గేటు ద్వారా ప్యాకేజీ–10కి, ఎల్‌ఎండీకి 3,480 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరులో ప్రస్తుతం 15.87 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

రాజన్నను దర్శించుకున్న రాజేశంగౌడ్



వేములవాడ: రాజన్నను మాజీ ఎస్ఎఫ్‌సీ చైర్మన్ గౌడిశెల రాజేశంగౌడ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ప్రసాదాలు అందించారు.

ఊరు మునిగింది.. ఉపాధి పోయింది

- పాత ఊరిలో పనులు ఫుల్
- పునరావాసకాలనీల్లో ఖాళీగా యువకులు
- నిర్వాసితులకు ఉపాధికల్పన చర్యలు శూన్యం
- పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వేడుకోలు



రుద్రవరంలోని హోటల్‌లో ఖాళీగా కూర్చున్న నిర్వాసిత యువకులు

వేములవాడఅర్బన్: మధ్యమానేరు ముంపు గ్రామాల్లోని యువతకు ఉపాధి కరువైంది. ప్రాజెక్టు రాకముందు వివిధ రకాల పనులతో బిజీగా కనిపించిన యువకులు.. నేడు ఎలాంటి పనులు లేక ఖాళీగా కూర్చుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే వారే తప్ప మిగతా వారికి సరైన ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. పాతూరిలో ఉన్నప్పుడు కులవృత్తులు.. కూరగాయలు పండించుకొని ఇంటి ఖర్చు వెల్లదీసిన వారు.. నేడు ఎలాంటి అవకాశాలు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రాజెక్టు కోసం భూములు తీసుకునే సమయంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న అధికారులు నేడు కనిపించడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టిన ఊరు మునిగి అస్తిత్వం కోల్పోయిన నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో పని దొరక్క ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

మధ్యమానేరులో మునిగిన 12 గ్రామాలు

బోయినపల్లి మండలం మాన్వాడ–చీర్లవంచ గ్రామాల మధ్య 2006లో మధ్యమానేరు ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో 12 గ్రామాలు కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి, శాభాష్‌పల్లి, చీర్లవంచ, చింతల్‌ఠాణా, గుర్రంవానిపల్లి, అనుపురం, కొడుముంజ, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి ముంపునకు గురయ్యాయి. 2008 గెజిట్ ప్రకారం 11,861 కుటుంబాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాలను పునరావాస కాలనీలలో ఏర్పాటు చేశారు.

నిర్వాసితులకు ఉపాధి కరువు

మధ్యమానేరు నిర్వాసితులకు నాంపల్లి గుట్ట పరిసరాలలో కొన్ని గ్రామాలకు అగ్రహారం గ్రామం వద్ద మరికొన్ని గ్రామాలకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. అటు సిరిసిల్లకు, ఇటు వేములవాడకు దగ్గరగా లేకపోవడంతో యువతకు ఎలాంటి పనులు దొరకడం లేదు. ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న వారు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతుండగా.. ఆ పని కూడా దొరకని వారు చాలా మంది ఖాళీగా ఉంటున్నారు. వీరంతా ప్రాజెక్టులో మునుగక ముందు పాత గ్రామాల్లో కూరగాయలు సాగు చేసుకోవడం.. వ్యవసాయ కూలీలుగా పనులకు వెళ్లడం.. ఉపాధిహామీ పనులకు వెళ్లి ఆర్థికంగా కుటుంబానికి చేదోడుగా నిలిచేవారు. పునరావాసకాలనీల్లో ఇలాంటి పనులు లేక వ్యవసాయభూములు ఇళ్ల సమీపంలో లేక కూరగాయల సాగు వంటి పనులు చేసుకోవడం లేదు. ప్రాజెక్టులో మునిగిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల, వ్యవసాయ భూముల పరిహారం డబ్బులతో ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇళ్లు కట్టుకోవడంతోపాటు పలువురు తమ కూతుళ్ల వివాహాలు చేశారు. దీంతో పరిహారం డబ్బులు ఖర్చవడంతోపాటు చాలా మంది అప్పులపాలయ్యారు. సొంతంగా వ్యాపారాలు పెట్టాలనే ఆలోచన ఉన్నా చేతిలో డబ్బులు లేక దిక్కులు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వమే స్పందించి పునరావాస కాలనీల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే చేతినిండా పని దొరుకుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

హామీలు నెరవేరేదెప్పుడో ?

- ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చి పట్టా ఇచ్చిన ప్రతీ కుటుంబానికి రూ.5.04 లక్షలు అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికి నెరవేరలేదు.
- ఈ ప్రాంత నిర్వాసితుల కోసం ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని చాలా సందర్భాల్లో ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ హామీ కూడా అమలుకు నోచుకోలేదు.
- పునరావాస కాలనీలలో కుటీర పరిశ్రములు ఏర్పాటు చేయాలని నిర్వాసితులు చాలా రోజులుగా కోరుతున్నారు. ఈ డిమాండ్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఖాళీగా ఉంటున్నాను



మాది రుద్రవరం పునరావాసకాలనీ. ఇక్కడ చేయడానికి పని లేక ఇంటి వద్దనే ఉంటున్నాను. ప్రభుత్వం ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పని దొరుకుతుంది. ప్రభుత్వమే ఉపాధి మార్గం చూపించాలి.

– తునికి రాకేశ్, రుద్రవరం

చేతిలో పని లేదు



ఊరు మునుగక ముందు మా నాన్న వ్యవసాయం చేస్తే కాలేజీకి వెళ్తూనే వ్యవసాయం పనులు చేసేవాడిని. ఇప్పుడు ఊరు మునిగింది. వ్యవసాయం లేదు. ఉద్యోగం రాలేదు. చేతిలో పనిలేక ఇంటి వద్దనే ఉంటున్నాను. ప్రభుత్వమే ఉపాధిమార్గం చూపించాలి.

– పోచంపల్లి రమేశ్, సంకెపల్లి

నిర్వాసితులను ఆదుకోవాలి



చదువుకొని ఉద్యోగం లేక, ప్రైవేటులో జాబ్‌లు దొరక్క ఖాళీగా ఉంటున్నాం. ప్రభుత్వం నిర్వాసిత యువతకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

– అరవింద్, రుద్రవరం

కులవృత్తి పోయింది



పాతూరు ఉన్నప్పుడు మా నాన్న కల్లు తీసి అమ్ముతుంటే కుటుంబం గడిసేది. ఇప్పుడు ఊరు మునిగింది. ఈత, తాటి చెట్లు మునిగాయి. చేతిలో పని లేకుండా పోయింది. ఇప్పుడు నాన్న, నేను ఖాళీగా ఉంటున్నాం. పునరావాస కాలనీల్లోని గౌడ కులస్తులకు ఉపాధి చూపించాలి.

– నాగుల సురేశ్‌గౌడ్, సంకెపల్లి

నేతన్నల చొరవ.. 'లబ్ధి' చేరువ

- 'పొదుపు' నకు మరో చాన్స్
- 'థ్రిఫ్ట్'లో చేరేందుకు 15వ తేదీ వరకు అవకాశం
- 5,700 మంది నేతన్నలకు ప్రయోజనం





ఇతను సిరిసిల్లకు చెందిన పవర్‌లూమ్ కార్మికుడు బాసబత్తిని రాజమౌళి(65). ప్రభుత్వం అమలు చేస్తున్న థ్రిఫ్ట్ ఫండ్(పొదుపు) పథకంలో చేరాడు. ప్రతీ నెల రూ.800 జమచేసుకున్నాడు. ప్రభుత్వం మరో రూ.800 జమచేసింది. ఇలా రాజమౌళి పొదుపు బ్యాంకు ఖాతాలో జమైన డబ్బులు లాక్‌డౌన్ కష్టకాలంలో వడ్డీతో సహా 18 నెలలకే మొత్తం రూ.28 వేలు వచ్చాయి. కుటుంబ అవసరాలకు అక్కరకు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు నెలకు రూ.వెయ్యి చొప్పున పొదుపు చేస్తున్నాడు. ఇప్పటి వరకు ఇలా సిరిసిల్లలో 5,700 మంది పొదుపు పథకంలో చేరారు. ఇంకా ఈ పథకంలో చేరని వాళ్లు చాలా మందే ఉన్నారు.

సిరిసిల్ల: నేతకార్మికులకు బతుకుపై భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న థ్రిఫ్ట్ పథకంలో చేరేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. సాంచాల మధ్య పనిచేసే వారు, అద్దకం, వైపని, టాకా పట్టే కార్మికులు థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్, సెక్యురిటీ(పొదుపు) పథకంలో చేరేందుకు ఈనెల 15 వరకు గడువు పొడగించింది. జిల్లాలో ఇప్పటి వరకు 5,700 మంది నేతన్నలు థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో చేరారు. ఇంకా ఎవరైనా చేరని వారి ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని కల్పించింది.

థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో చేరితే..

- సాంచాల మధ్య శ్రమించే కార్మికులతోపాటు వస్త్రపరిశ్రమ అనుబంధ రంగాలు డైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, సైజింగ్, వైపని, బ్లీచింగ్, రోలింగ్ పనులు చేసే కార్మికులు కూడా ఈ పథకంలో చేరేందుకు అర్హులు.
- కార్మికులు తమ సంపాదనలో గరిష్ఠంగా రూ.1200 నెలనెలా పొదుపు చేసి తమ బ్యాంకు పొదుపు ఖాతాలో జమ చేస్తే.. అంతే మొత్తంలో ప్రభుత్వం జమచేస్తుంది.
- కార్మికుల వాటా, ప్రభుత్వ వాటాను 36 నెలల తర్వాత మొత్తం డబ్బును వడ్డీతో సహా తీసుకునే అవకాశం ఉంటుంది.
- ఈ పథకంలో చేరేందుకు ప్రభుత్వం ఆరు నెలల ముందుగానే పొదుపు డబ్బులను తీసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో కరోనా కష్టకాలంలో థ్రిఫ్ట్ డబ్బులు నేతన్నలకు ఎంతో ఉపయోగపడ్డాయి.
- 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులు. ఇప్పటి వరకు ఈ పథకంలో చేరని కార్మికులు వెంటనే జౌళిశాఖ అధికారులను కలిసి వివరాలు అందించాలి. బీమా పథకంలో చేరిన కార్మికులు ఏదైనా కారణంతో చనిపోతే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము లు అందుతాయి.

నేతన్నలు సద్వినియోగం చేసుకోవాలి



నేతన్నలు థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో చేరిన వారు మళ్లీ దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదు. ఇంకా అర్హులైన కొత్త వారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం కల్పించిన ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– మిట్టకోల సాగర్, చేనేత, జౌళిశాఖ ఏడీ

బో'నమో' పోచమ్మ





సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం పోచమ్మ బోనాలు కనులపండువగా జరిగింది. ఆషాఢమాసం అమ్మవారికి బోనాలు తీసి మొక్కులు సమర్పించారు. విద్యానగర్ శ్రీఅభయాంజనేయ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఇంటికో బోనం తీశారు. దప్పుచప్పళ్లతో పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. మిత్ర మండలి అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, ప్రతినిధులు రమేశ్, ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దేవేందర్‌గౌడ్, ఆకుల శ్యామ్, బిట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో బాల్యం బందీ

- గంజాయి సేవిస్తున్న విద్యార్థులు
- శివారుప్రాంతాలే అడ్డాలు
- దుకాణాలు, టేలాలలో విక్రయాలు
- సరఫరాలో మైనర్లే కీలకం
- ఓవైపు అవగాహన.. మరోవైపు ఆగని దందా



కల్లు దుకాణాలను అడ్డాలుగా మార్చుకొని పలువురు యువకులు గంజాయి దమ్ము కొడుతున్నారు. ఎల్లారెడ్డిపేట శివారు దుకాణాల్లో కల్లు తాగేందుకు వెళ్తున్న పలువురు యువకులు అప్పటికే వారి వెంట తీసుకెళ్తున్న గంజాయి నింపిన సిగరేట్లను తాగుతూ మత్తులో తూగుతున్నారు. కల్లు తాగుతున్నట్లు పైకి కనిపిస్తున్నా చాటుమాటున గంజాయి సిగరేట్లు తాగుతూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.



తంగళ్లపల్లిలో పోలీసులు పట్టుకున్న గంజాయి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు, యువత మత్తులో చిత్తవుతున్నారు. గంజాయి నింపిన సిగరేట్లు తాగుతూ మైకంలో తేలియాడుతున్నారు. ఈ పోకడ జిల్లాలో ఇటీవల ఎక్కువైంది. మండల కేంద్రాలు, గ్రామాల శివారులే అడ్డాలుగా చేసుకొని గంజాయి నింపిన సిగరేట్లు తాగుతూ మత్తులో తూగుతున్నారు. ఇటీవల జిల్లాలోని పలు హైస్కూళ్లలోని కొందరు విద్యార్థులు మత్తులో కనిపించడం ఉపాధ్యాయులు గమనించారు. పరిస్థితులు చేయిదాటడంతో వారు కూడా ఏమి చేయలేకపోతున్నారు. తల్లిదండ్రులు, పోలీస్ అధికారులు చొరవ తీసుకుంటేనే విలువైన బాల్యాన్ని రక్షించగలుగుతామని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పాన్‌టేలాలలో విక్రయాలు

జిల్లాలోని పలు ప్రధాన రహదారుల వెంట ఉన్న పాన్‌టేలాలు, దుకాణాలే గంజాయి విక్రయాలకు అడ్డాలుగా మారాయి. ఎవరికీ అనుమానం రాకుండా దుకాణాల్లో రాత్రి పూట డంపు చేసిన గంజాయి ప్యాకెట్లుగా మార్చి మైనర్ల ద్వారా చేరవేస్తున్నారు. ఇటు మహారాష్ట్ర నుంచి రామగుండంకు, కామారెడ్డి జిల్లా కేంద్రానికి, అటు ఆంధ్రలోని వైజాగ్, అనకాపల్లి నుంచి రైలు మార్గాల ద్వారా టోకుగా వచ్చిన గంజాయి బస్తాలను రామగుండం, వరంగల్, ఖాజీపేట, కామారెడ్డి రైల్వే స్టేషన్లలో దించుకొని అక్కడి నుంచి ఖరీదైన కార్లలో నాంపెల్లి, మాచారెడ్డి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ బ్యాగుల్లో దించిన గంజాయిని నమ్మకస్తులైన కూలీలను ఏర్పాటు చేసుకొని ప్యాకెట్ల రూపంలో మారుస్తున్నారు. ఆ ప్యాకెట్లను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల కిరాణదుకాణాలు, పాన్‌టేలాలు, జిరాక్స్ సెంటర్లు, టెంట్‌హౌస్‌లలో డంపు చేస్తున్నారు. ఇలా గంజాయి చేతులమారే క్రమంలో వారికే ప్రత్యేకమైన కోడ్‌లు చెబితేనే ఈ వ్యవహారం అంతా సాఫీగా సాగుతుంది. ఆ కోడ్ చెప్పిన వారికే గంజాయి పొట్లాలు ఇచ్చేలా నిబంధనలు పెట్టుకున్నట్లు సమాచారం.

ఓ వైపు అవగాహన.. మరోవైపు ఆగని దందా

జిల్లాలో మత్తుపదార్థాల వినియోగాన్ని నివారించేందుకు పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా యాంటీడ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రజలకు గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించేందుకు సినిమా నటులను భాగస్వాములను చేసి సిరిసిల్లలో భారీ ర్యాలీ నిర్వహించడం ఇందుకు ఉదాహరణ. అయితే పోలీసులు మత్తు పదార్థాలను నిషేధించాలని ఏ స్థాయిలో కృషి చేస్తున్నారో అదే స్థాయిలో గంజాయి దందా కొనసాగుతోంది. ఇందుకు గత ఆరు నెలల్లో 17 కేసులు నమోదు చేసి, 55 మందిని అరెస్టు చేసినట్లు పోలీస్ గణాంకాలు చెబుతున్నాయి.

మత్తులో బాల్యం

ఆడుతూ.. పాడుతూ చదువుకునే విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపి తల్లిదండ్రులు వారి ఉజ్వల భవిష్యత్తుపై కలలు కంటుండగా.. కొందరి ప్రమేయంతో విద్యార్థులు, యువకులు గంజాయి మత్తులో తూగుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లోని హైస్కూల్ స్థాయి విద్యార్థులు విరామ సమయంలో సమీప రహస్య ప్రాంతాలకు వెళ్లి గంజాయిని సేవించి తిరిగి తరగతులకు హాజరవుతున్నారు. గంజాయి మత్తులో ఉపాధ్యాయుల మాటలు వినకపోగా.. వారిపైకే దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈ సంఘటనలు చూస్తున్న ఉపాధ్యాయులు విస్తుపోతున్నారు. చదువుకొని బాగుపడతారనుకున్న పిల్లలు బాల్యంలో దారితప్పడంతో తల్లిదండ్రుల ఆశలు ఆవిరవుతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థులకు గంజాయి, సిగరెట్లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. కొంతమంది విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డట్లుగా అనుమానాలు ఉన్నాయి. వారిని కట్టడి చేయడానికి పాఠశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించాం. మత్తుకు దూరంగా ఉండాలని సూచించాం. తల్లిదండ్రులు సైతం పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలని కోరాం.

– ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్

సరఫరాను అడ్డుకుంటున్నాం



వివిధ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్న గంజాయిని అడ్డుకుంటున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా కాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేస్తున్నాం. విద్యార్థులు, యువత గంజాయికి బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైన ఉంది. వారిపై అనుమానాలు వస్తే మాకు సమాచారం అందించాలి. మత్తు పదార్థాలను పూర్తిగా కట్టడి చేసేందుకు యాంటీ డ్రగ్స్ కమిటీలు వేసి అవగాహన కల్పిస్తాం.

– మొగిలి, సీఐ, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గ్రామంలో సిరిసిల్లకు చెందిన హిమాన్షి పిల్లల ఆస్పత్రి ఆ. ద్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్‌దీప్ 0 నుంచి 20 ఏళ్లలోపు వారందరికీ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఆయిట్ల బాలరాజు, కిషన్‌రెడ్డి, మో హన్, శ్రీధర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



కోనరావుపేట(వేములవాడ): పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి అన్నారు. కోనరావుపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ ప్రకటించే వరకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్, మెడికల్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో అనేకసార్లు ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వం తన వైఖరిని వీడటం లేదన్నారు. 18 ఏళ్లుగా విద్యారంగంలో పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలో మాదిరిగా ప్రమోషన్లు, బదిలీలు, నూతన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో సర్వీస్‌పర్సన్లను నియమించి, అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి, నగదు రహిత వైద్యం అందిచాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నూగూరి దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సత్తు రవీందర్, మల్లారపు పురుషోత్తం, కార్యవర్గ సభ్యులు బచ్చు అశోక్, సిద్దంశెట్టి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దేవేందర్, రవీందర్ పాల్గొన్నారు.

బైకు, కారు ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



గాయపడిన శివకృష్ణ

కామారెడ్డిక్రైం : కామారెడ్డి మండలం ఉగ్రవాయి వద్ద బైకు, కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బీబీపేట మండల కేంద్రానికి చెందిన సిద్ధిరాములు అలియాస్ రమేశ్(35) స్థానికంగా మెడికల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన పల్లె శివకృష్ణ బీబీపేటలోని ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తున్నాడు. వారిద్దరూ కలిసి ఆదివారం సాయంత్రం పనులు ముగించుకొని కామారెడ్డికి బైక్‌పై బయలుదేరారు. ఉగ్రవాయి సమీపంలో వీరి బైక్ ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమేశ్ అక్కడికక్కడే మృతిచెందగా శివకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన శివకృష్ణను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నా కొడుకును కాపాడండి

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలుడు
- బతికించుకునేందుకు తల్లి అష్టకష్టాలు
- రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు
- వైద్యసాయం చేయాలని మంత్రి కేటీఆర్‌కు వేడుకోలు



అచేతన స్థితిలో ఉన్న కుమారుడితో తల్లి నాగలక్ష్మి

సిరిసిల్లఅర్బన్: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం.. కుటుంబ పెద్ద మరణంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. తల్లి కూలి పనికి వెళ్తేనే పూట గడిచే పరిస్థితి. అన్నీ తానై ఇద్దరు కొడుకులను కంటికి రెప్పలా సాదుకుంటోంది. ఈ కష్టాలు చాలవన్నట్లు విధి వారి కుటుంబంపై పగబట్టింది. చిన్న కొడుకు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా.. వైద్యం చేయించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడుకు చెందిన ఇటిక్యాల నాగలక్ష్మి–దేవయ్యలకు ఇద్దరు కుమారులు. దంపతులిద్దరూ కూలి పనులు చేసుకునే వారు. ఆరేళ్ల క్రితం దేవయ్య అనారోగ్యానికి గురై, మృతిచెందాడు. అప్పటినుంచి పిల్లలను నాగలక్ష్మి అన్నీ తానై పెంచుతోంది. చిన్న కుమారుడు మూడో తరగతి చదువుతున్న భానుప్రసాద్ రెండేళ్ల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరీక్షించిన వైద్యులు బాలుడి తలలో కణితిని గుర్తించి తొలగించారు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక ప్రజాప్రతినిధి సహాయంతో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఆ సమయంలో మంత్రి శస్త్రచికిత్సకు చొరవచూపారు.

మరోసారి వెక్కిరించిన విధి

సాఫీగా సాగుతున్న వారి జీవితంలోకి మరోసారి కష్టాలు ప్రవేశించాయి. చిన్న కొడుకు ప్రాణాపాయం నుంచి గట్టెక్కాడనుకున్న ఆ తల్లి సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ఇటీవల పాఠశాలకు వెళ్తున్న భానుప్రసాద్ అస్వస్థతకు గురై, కిందపడిపోయాడు. వైద్యులకు చూపించగా.. బ్రెయిన్ ట్యూమర్‌గా వైద్యులు నిర్ధారించారు. వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని సూచించారు. వీరి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఆస్పత్రి వైద్యులు సరేంద్రబాబు ఉచితంగా ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు ఎల్లయ్య యాదవ్ గ్రామస్తుల సహకారంతో రూ.73 వేలు ఆర్థికసాయం అందించారు. తన కొడుకును బతికించాలని ఆపన్నహస్తం కోసం ఆ తల్లి ఎదురుచూస్తోంది. మెరుగైన చికిత్స అందించేందుకు దాతలు సహకరించి, తన కుమారుడిని కాపాడాలని వేడుకుంటోంది. గతంలో తన కొడుకుకు ప్రాణభిక్ష పెట్టిన మంత్రి కేటీఆర్ మరోసారి కాపాడాలని కోరుతోంది.

సాయం చేయాల్సినవారు సంప్రదించండి

ఇటిక్యాల లక్ష్మి, బ్యాంక్ అకౌంట్ నంబర్: 62500978274, సిరిసిల్ల ఎస్‌బీఐ బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్ 0020140.

ముంపు గ్రామాల సమస్యలు తీరుస్తాం

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



యువకులకు కండువా కప్పుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మధ్యమానేరు ముంపు గ్రామాల సమస్యలు తీరుస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ భరోసానిచ్చారు. వేములవాడలోని తన నివాసంలో ఆదివారం సంకెపల్లికి చెందిన 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు భృతి ఇస్తూనే ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు.

కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వండి

గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ తగిన ప్రతిఫలం ఇవ్వడం లేదని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని కోరారు. వేములవాడలోని తెలంగాణచౌక్‌లోని ఉద్యమాల గద్దెపై చేపట్టిన కార్మికుల సమ్మెకు ఆదివారం తన మద్దతు ప్రకటించారు. వేములవాడ అర్బన్ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, నాయకులు సాగారం వెంకటస్వామి, రగుడు పర్శరాం, రాజకుమార్, వంగ పర్శరాం, ఇటిక్యాల లింగయ్య, వనపట్ల ప్రభాకర్ రెడ్డి, కత్తి కనకయ్య, బోనాల రమేశ్, అంబాల చంద్రయ్య, యూత్ అధ్యక్షుడు చిట్ల శ్రీనివాస్, బొమ్మ తిరుపతి పాల్గొన్నారు.

కథ చెబుతారా.. ఊ కొడతాం



వివిధ పాఠశాలల విద్యార్థులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని అనంతనగర్ విజ్ఞానవర్ధిని పాఠశాలలో టీటీడీ ఆధ్వర్యంలో ఆదివారం 'కథ చెబుతారా.. ఊ కొడతాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు పది పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కౌన్సిలర్ భాస్కర్, టీటీడీ ధర్మాచార్యులు కొత్వాల్ సతీశ్, తిరుపతి, ప్రముఖ కవి మద్దికుంట లక్ష్మణ్, పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, యోగా మాస్టర్ ఉప్పల శ్రీనివాస్, లింబాద్రి ఉన్నారు.

ప్రాణాలు 'వేగం'గా పోతున్నాయ్

- అతివేగమే ప్రమాదాలకు కారణం
- జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు జరిగినవి 106
- మృతులు 34 మంది
- నిబంధనలు పాటించని వాహనదారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సిరిసిల్ల కోర్టు ఎదురుగా 20 రోజుల క్రితం జరిగిన ప్రమాదం. డివైడర్ వద్ద కామారెడ్డి వైపు వెళ్తున్న కారును రెండు ట్రాక్టర్లు ఢీకొట్టాయి. ఈ ఘటనలో కారు దెబ్బతింది. ట్రాక్టర్లు వేగంగా వెళ్తున్నాయని, కారు నెమ్మదిగా వెళ్లడం, అదే ప్రాంతంలో ఓ స్పీడ్ బ్రేకర్ ఉండటం వల్ల పెను ప్రమాదం తప్పిందని పోలీసు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది.



వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లిలో గత నెల 30న రాత్రి టిప్పర్ ఓ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. టిప్పర్ అధిక వేగంతో రావడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుని బంధువు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సిరిసిల్ల క్రైం: అనేక రోడ్డు ప్రమాదాలకు అతివేగమే మూలకారణమవుతోంది. ఫలితంగా కొందరు గాయాలపాలవుతుండా మరికొందరి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ ఇటీవల జరిగిన ఓ సమావేశంలో తెలిపారు. నిబంధనలపై అవగాహన కల్పించడానికి పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. వారు చెప్పే అంశాలను క్షేత్రస్థాయిలో పాటించేలా చర్యలుండటం లేదన్న విమర్శలున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు 106 ప్రమాదాలు జరగగా 34 మంది మృతిచెందారు.

అక్రమ వ్యాపారాలు..

జిల్లాలో పీడీఎస్ బియ్యం, మట్టి, ఇసుక అక్రమంగా తరలించే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు ఇటీవలి సంఘటనలతో అర్థమవుతోంది. వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. అధికారులు పట్టుకొని కేసు నమోదు చేస్తే రూ.వేలల్లో, కొన్నిసార్లు లక్షల్లో జరిమానా చెల్లించాల్సి వస్తుందన్న కారణంతో తప్పించుకునేందుకు పరిమితికి మించి వేగంతో వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇంకొందరు సిరిసిల్ల, వేములవాడ బైపాస్ రోడ్లలో బైక్ రైడింగ్స్ పేరిట స్టంట్స్ వేస్తున్నారు. ఇక మందుబాబులు మద్యం మత్తులో చేస్తున్న రచ్చ అంతాఇంతా కాదు. ఇలాంటి వాళ్లు వాహనాలు నడిపి, ఎదురుగా వచ్చేవారి మృతికి, ఆస్పత్రుల పాలవడానికి కారణం అవుతున్నారు.

ప్రచారం చేస్తున్నా.. పట్టింపు లేదు

వాహనచట్టం, రోడ్డు నిబంధనలు పాటించాలంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీసులు బైక్‌పై దాదాపు రెండు నెలలుగా ప్రచారం చేయిస్తున్నారు. కానీ చాలామంది ఒక చెవితో విని మరో చెవితో వదిలేస్తున్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకోకుండా, కారులో వెళ్తున్నవారు సీటు బెల్ట్ లేకుండానే ప్రయాణిస్తున్నారు. బైక్‌లపై వెళ్లేవారిలో ఎక్కువమంది తలకు గాయాలై, కారులో ఉన్నవారికి స్టీరింగ్ చాతిలో గట్టిగా తగలడం వల్ల గుండెపై ప్రభావం పడి చనిపోతున్నారని అనేక కేసుల్లో బహిర్గతమైనట్లు వైద్యులు తెలిపారు.

పాటించాల్సిన నిబంధనలు..

- బైక్‌పై వెళ్లే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి.
- ట్రాఫిక్ సిగ్నల్స్ ఫాలో కావాలి.
- రాంగ్ రూట్‌లో వాహనాలు నడపొద్దు
- కారులో డ్రైవింగ్ చేసేవారితోపాటు అందులో ఉన్న అందరూ సీటు బెల్ట్ ధరించాలి.
- వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్ ఉండాలి.
- రోడ్డుపై వెళ్లే సమయంలో సంబంధిత రోడ్డు వేగ పరిమితికి అనుగుణంగా వాహనం నడపాలి.

వాహనాలు బాధ్యతగా నడపాలి



ప్రమాదాల నివారణకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై కేసు నమోదు చేసి, జరిమానా విధిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలు పాటిస్తే ప్రాణనష్టం అపవచ్చు. ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి చెందితే ఆ కుటుంబ భవిష్యత్ అంధకారం అవుతుంది. బాధ్యతగా వాహనాలు నడపాలి.

– ఎస్పీ అఖిల్ మహాజన్

సిద్ధప్ప ఆశయసాధనకు కృషి చేయాలి

- తెలంగాణ వివేక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్శరాములు



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తమ కలంతో సమాజాన్ని చైతన్యం చేసే అవకాశం కేవలం కవులకే ఉందని, నిరంతరం సమాజ చైతన్యం కోసం వరకవి సిద్ధప్ప పరితపించేవారని తెలంగాణ వివేక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు అన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో సిద్ధప్ప 120వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఆయన జ్ఞానబోధిని 4 భాగాలు, అశోక సామ్రాజ్యంతోపాటు సుమారు 40 గ్రంథాలను రచించారని తెలిపారు. నిజాం నిరంకుశత్వాన్ని నిరసించారన్నారు. ఈ నాటి కవులు సిద్ధప్ప కవితలను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపెన రమేశ్, అజయ్, పద్మారెడ్డి, కాశీం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పాటలతో సామాన్యుల్లో చైతన్యం..

ముస్తాబాద్(సిరిసిల్ల): వరకవి సిద్ధప్ప జయంతిని ముస్తాబాద్‌లో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. సిద్ధప్ప తన పాటలు, పద్యాలతో సామాన్యుల్లో చైతన్యం తీసుకువచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎదురూరి స్వామి, నాయకులు రమేశ్, గోపికృష్ణ, వెంకటేశ్, రాజశేఖర్, మహేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటను దిగ్బంధించిన పోలీసులు

- ఐదుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు
- 25 వాహనాలకు జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పోలీసులు ఎల్లారెడ్డిపేటను ఆదివారం రాత్రి దిగ్బంధించారు. మండల కేంద్రంలోని పాతబస్టాండ్ నుంచి మూడు తోవల వరకు పోలీసులు మోహరించి వాహన తనిఖీలు చేపట్టారు. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఎస్సై ప్రేమ్‌దీప్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. బండి పేపర్లు, నంబర్‌ప్లేట్ లేని 25 వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ కొందరు వాహనదారులు కనీసం రోడ్డు భద్రత నియమాలు పాటించడం లేదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోతున్నాయన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మానేరు'లో చేపల వేట బంద్

- మిడ్, అప్పర్ జలాశయాల్లో రెండు నెలలపాటు నిషేధం
- చేపల సంతతి వృద్ధి కోసం మత్స్యశాఖ నిర్ణయం



మిడ్ మానేరు జలాశయం

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలో ఉన్న రెండు ప్రధాన జలాశయాల్లో చేపల వేట పది రోజులుగా నిలిచిపోయింది. చేపల సంతతి వృద్ధి కోసం మిడ్, అప్పర్ మానేరు ప్రాజెక్టుల్లో ఈ నెల 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపలు పట్టరాదని జిల్లా మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బోయినపల్లి మండలంలోని మాన్వాడ మిడ్‌మానేరు, గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుల్లో చేపలు, రొయ్యలు పడుతూ జిల్లాలోని మత్స్య కార్మికులు ఉపాధి పొందుతున్నారు. జూలై నెల ఆరంభం నుంచి ఆగస్టు చివరి వరకు చేపల అండ విసర్జనతో సంతతి పెరిగే కాలం కావడంతో చేపల వేట విరామానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఏటా చేప, రొయ్య పిల్లల విడుదల

మిడ్ మానేరు, అప్పర్ మానేరు ప్రాజెక్టుల్లో ప్రభుత్వం ఏటా చేప, రొయ్య పిల్లలు విడుదల చేస్తోంది. గత మూడేళ్లలో రెండు జలాశయాల్లో కలిపి 117 లక్షల చేప, 88.27 లక్షల రొయ్యల పిల్లలను వదిలినట్లు అధికారులు తెలిపారు. అలాగే చేపలు పట్టడానికి మత్స్యకారులతోపాటు పలువురు మిడ్ మానేరు ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు సర్కారు లైసెన్స్ ఇచ్చింది. గత సీజన్ చివరి వరకు 5,400 టన్నుల మేర చేపలు, 1,403 టన్నుల మేర రొయ్యల ఉత్పత్తి జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. కట్ల, రాహు, మృగాల రకం చేప పిల్లలు వదలాగా ఒక్కో చేప 10 నుంచి 20 కేజీల బరువు వచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు.

చేపలు పడితే లైసెన్స్ రద్దు..

జిల్లా మత్స్యశాఖ అధికారులు 08–సీ–2023 ద్వారా ప్రాజెక్టు పరిసర గ్రామాల్లోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేపలు పట్టొద్దని నోటీసులు జారీ చేశారు. నిషేధంపై దండోరా వేయించాలని ఆయా గ్రామ పంచాయతీలకు లేఖలు రాశారు. నిషేధ ఉత్తర్వులు అతిక్రమించి, చేపలు పడితే వలలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకోవడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కాగా అధికారులు వచ్చి చూస్తారా.. పట్టుకుంటారా అంటూ కొందరు చాటుగా చేపలు పడుతున్నట్లు తెలిసింది. చేపల సంతతి అభివృద్ధి జరగాలంటే అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.

కఠినచర్యలు తీసుకుంటాం



మిడ్, అప్పర్ మానేరు ప్రాజెక్టుల్లో రెండు నెలలపాటు చేపల వేట నిషేధించాం. సంబంధిత ఉత్తర్వులను పెడచెవిన పెట్టి, చేపలు పడితే వలలు, తెప్పెలు జప్తు చేస్తాం. చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటాం.

– జి.శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ముదిరాజ్‌లు సంఘటితం కావాలి



సమావేశంలో ముదిరాజ్ నాయకుల అభివాదం

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మాండ్లు

సిరిసిల్లటౌన్: ముదిరాజ్‌లు సంఘటితమై సామాజికవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుంచాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ముదిరాజ్ మహాసభ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. హన్మాండ్లు మాట్లాడుతూ ఈనెల 14న జరిగే సిరిసిల్ల మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్‌గా యామ తిరుపతితోపాటు 11 మంది డైరెక్టర్లను గెలిపించుకోవాలని కోరారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు యామ తిరుపతిని బలపరుస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థి యామ తిరుపతి, కోడి అంతయ్య, రాయిని ప్రతాప్, పిల్లి మధు, పొట్ల గోపాల్ తదితరులున్నారు.

మంచంపట్టిన తల్లికి ఆర్థిక చేయూత

- స్పందిస్తున్న దాతలు



ఆర్థికసాయం, బియ్యం అందిస్తున్న క్లబ్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పక్షవాతానికి గురై మంచంపట్టిన ఓ తల్లికి దాతలు ముందుకొచ్చి ఆర్థికంగా ఆదుకుంటున్నారు. బీడీలు చుట్టి చదివించిన అమ్మ కోసం కొడుకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వదిలి స్వగ్రామానికి వచ్చి తల్లికి సేవలు చేస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని గమనించిన పలువురు దాతలు స్పందిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఆకుల యాదగిరి స్థానిక గ్రామపంచాయతీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసి 35 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అతని భార్య ఆకుల లక్ష్మి బీడీలు చుడుతూ.. కుమారుడు వేణుగోపాల్‌ను చదివించి, కూతురు మాధవి పెళ్లి చేసింది. కొడుకు వేణుగోపాల్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల తల్లి లక్ష్మి నరాల బలహీనత, పక్షవాతంతో మంచంపట్టింది. విషయం తెలిసి కొడుకు ఉన్న ఉద్యోగం వదులుకొని తల్లికి సపర్యలు చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకొని ఎల్లారెడ్డిపేటకు చెందిన పూర్వ విద్యార్థులు రూ.14 వేలు, వేణుగోపాల్ బాల్యమిత్రుడు ఎన్నారై బొమ్మకంటి సతీశ్ రూ.5వేలు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.3వేలు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. మరికొందరు ముందుకొచ్చి తన తల్లి వైద్య ఖర్చులకు సాయం అందించాలని కుమారుడు వేణుగోపాల్ కోరుతున్నాడు.